
# జగదాంబ సేవాలాల్ వేడుకల్లో ఎమ్మెల్యే!

- శివన్నగూడెం తండాలో ఘనంగా వార్షికోత్సవం
- తండా అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వెల్లడి





**సంగారెడ్డి, మే 09 (జనం పవర్):** కొండాపూర్ మండలం శివన్నగూడెం తండాలోని జగదాంబ సేవాలాల్ ఆలయ ఐదో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు తండా ప్రజలు, యువకులు లంబాడ సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లంబాడ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తండాలో ఉన్న పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో తండా ప్రజలు తనకు భారీ మెజార్టీ అందించారని గుర్తు చేసుకున్నారు. తండా అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని చెప్పారు. ఆలయ అభివృద్ధికి సైతం తన వంతు సాయం చేస్తానని తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొనడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వినోద్, పార్టీ నాయకులు విఠల్, గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, యువకులు, మహిళలు హాజరయ్యారు.

# విభజన హామీలను వెంటనే అమలు చేయాలి!

**నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం**

**ప్రధాని పర్యటన నేపథ్యంలో బహిరంగ లేఖ విడుదల**

**ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్**



**బెజ్జంకి, మే 09 (జనం పవర్):** తెలంగాణ రాష్ట్రానికి 2014లో ఇచ్చిన విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల ప్రధాన కార్యదర్శి దొంతరవేని మహేష్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీకి ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ.. దేశంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

మోదీ ప్రభుత్వం కార్పొరేట్ రాజకీయాలకు కొమ్ముకాస్తోందని ఆయన విమర్శించారు. తెలంగాణ పర్యటనకు వస్తున్న ప్రధాని పాత హామీలను అమలు చేయకుండా కొత్త హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విభజన చట్టంలోని అంశాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు బోనగిరి శ్రావణ్, నాయకులు రొడ్డ చరణ్, అంతటి సురేష్, అలీ సబ్, బాల మల్లు, రాకేష్ పాల్గొన్నారు.




# జన్మదినం వేళ రక్తదాన శిబిరం!

**120 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం**

**సన్‌రైజ్ ఆసుపత్రిలో గుండె వైద్యం ఉచితం: డాక్టర్ స్వామి గౌడ్**

**సంగారెడ్డి, మే 09 (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలో సేవా కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. డాక్టర్ స్వామి గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని సన్‌రైజ్ ఆసుపత్రి వద్ద శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వామి గౌడ్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడటానికి రక్తం చాలా అవసరమని చెప్పారు. ఎండాకాలంలో రక్త కొరతను దృష్టిలో ఉంచుకుని ఏటా మే నెలలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 120 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారని ఆసుపత్రి ఎండి సంతోష్ గౌడ్ వెల్లడించారు. దాతలు, శ్రేయోభిలాషులు, మీడియా ప్రతినిధులు ఈ శిబిరాన్ని విజయవంతం చేశారు. గత 12 ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని స్వామి గౌడ్ పేర్కొన్నారు. అలాగే సన్‌రైజ్ ఆసుపత్రిలో కొత్తగా కార్డియాలజీ సేవలు ప్రారంభించామని.. ఆరోగ్యశ్రీ కింద గుండె వైద్యం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అటవీ చెక్‌పోస్టుల వద్ద వసూళ్ల వేట.. జనం ఆగ్రహం!

- ఫాస్ట్ ట్రాక్ పేరుతో వాహనదారుల జేబులకు చిల్లు
- గుంతల రోడ్లకు టోల్ వసూళ్లు ఏంటని నిలదీత
- బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

అడవిని కాపాడాల్సిన శాఖ ఇప్పుడు కాసులు కురిపించే వేటలో పడిందని జన్నారం నిరసనకారులు మండిపడ్డారు. ఫాస్ట్ ట్రాక్ పేరుతో అటవీ శాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్నాయని ఆరోపించారు. తపాలాపూర్ రహదారిపై బీజేపీ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించి అటవీ శాఖ అధికారుల తీరును ఎండగట్టారు.

జన్నారం మండలంలోని ఇంధన్‌పెల్లి, కళమడుగు, తపాలాపూర్ మీదుగా వెళ్లే ప్రయాణికులకు అటవీ శాఖ ఫాస్ట్ ట్రాక్ పేరుతో చుక్కలు చూపిస్తోందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ మాట్లాడుతూ.. వాహనాలు వెళ్లడానికి కనీసం రోడ్లు సరిగ్గా లేవని, గుంతలమయమైన దారులకు టోల్ వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ నిధులను రోడ్ల మరమ్మతులకు వాడుతున్నారా అని నిలదీశారు.

సాధారణంగా జాతీయ రహదారులపై టోల్ ప్లాజాలు ఉంటాయని, దట్టమైన అడవిలో గ్రామాల మధ్య తిరిగే వాహనాలపై పన్నులు వేయడం దారుణమన్నారు. వసూలు చేస్తున్న లక్షలాది రూపాయలు జంతువుల సంరక్షణకు ఖర్చు చేస్తున్నారో లేక ఖజానా నింపుకోవడానికో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఈ చెక్‌పోస్టులను ఎత్తివేయాలని, లేదంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ పోరాటానికి స్థానిక ప్రజలు, వివిధ సంఘాల నాయకులు మద్దతు పలికారు. అధికారులు దిగిరాకపోతే ఈ పోరు తీవ్ర రూపం దాల్చుతుందని స్పష్టం చేశారు.




# ఓటరు జాబితా శుద్ధికి సహకరించండి!

**మరణించిన వారి పేర్లు, నకిలీ ఓట్ల తొలగింపు ముఖ్యం**

**జాబితా పారదర్శకతలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం**

**సంగారెడ్డి ఆర్డీవో రాజేందర్**




**సంగారెడ్డి, మే 09 (జనం పవర్):** ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని సంగారెడ్డి ఆర్డీవో రాజేందర్ సూచించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ వనితతో కలిసి కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా శుద్ధి ప్రక్రియలో భాగంగా మరణించిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమం పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగేందుకు స్థానిక నేతలు తోడ్పడాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బూత్ లెవల్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని.. ప్రజల నుంచి సరైన సమాచారం సేకరించడంలో వారికి సాయం చేయాలని సూచించారు. ఓటరు జాబితా సక్రమంగా ఉండడం వల్ల ప్రజాస్వామ్యం బలపడుతుందని ఆర్డీవో పేర్కొన్నారు. నిర్ణీత సమయంలోగా ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు!

**ఎన్ని ఇబ్బందులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదు**

**బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్**





**సంగారెడ్డి, మే 09 (జనం పవర్):** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పుడల్లా తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ మండిపడ్డారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు అడిగినందుకే తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. జైలు తనకు కొత్త కాదని క్రిశాంక్ స్పష్టం చేశారు. ఎలాంటి ఒత్తిడులు వచ్చినా వెనక్కి తగ్గేది లేదన్నారు. ప్రజలకు నిజాలు తెలియజేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. తాను కేసీఆర్ శిష్యుడినని పేర్కొన్న ఆయన.. ప్రభుత్వ అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడతామని హెచ్చరించారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని.. ప్రజా క్షేత్రంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసే తప్పులను ఎండగట్టడం ఆపేది లేదని ఆయన తేల్చి చెప్పారు.

# బాలుడి చికిత్సకు ఏడు లక్షల భరోసా!

**హర్షిత్ ప్రిన్స్ కుటుంబానికి ఎల్ ఓ సి చెక్కు అందజేత**

**ఎమ్మెల్యే దంపతులకు బాధితుల కృతజ్ఞతలు**



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 32వ డివిజన్ కు చెందిన హర్షిత్ ప్రిన్స్ ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ఏడు లక్షల రూపాయల ఎల్ ఓ సి చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు, మేయర్ ధర్ని మధుకర్, టీపీసీసీ సభ్యులు నూకల రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొని బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఆసుపత్రి ఖర్చుల కోసం భారీ సాయం అందేలా చేసిన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు, సురేఖ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆపద సమయంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే దంపతుల రుణం తీర్చుకోలేనిదని పేర్కొన్నారు. సకాలంలో సాయం అందడం వల్ల బాలుడికి మెరుగైన వైద్యం అందుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దంపతుల చొరవతో తమ కుటుంబానికి పెద్ద ఊరట లభించిందని వారు కొనియాడారు.

# పలు వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే సందడి!

**నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు**

**ప్రజలతో మమేకమవుతూ ఆప్యాయ పలకరింపులు**



**జుక్కల్, మే 10 (జనం పవర్):** జుక్కల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు పాల్గొన్నారు. నూతన వధూవరులను మనసారా ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో నిండిపోవాలని ఆకాంక్షించారు. ప్రతి శుభకార్యంలో ప్రజలతో మమేకమవుతూ ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించడం పట్ల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలికేట్ విట్టల్ రెడ్డి, ప్రేమ్ కుమార్ సెట్, మున్సిపల్ కౌన్సిలర్ ముజాహిద్, మఠం సంతోష్ అప్ప పాల్గొన్నారు. వీరితో పాటు అసద్ అలీ, శాంతాపూర్ మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, బొగడమీద సాయిలు, ఖలీల్, గణేష్ గౌండ, కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

# ఆరోగ్య కేంద్రంలో మేయర్ ఆకస్మిక తనిఖీ!

**వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని ఆదేశం**

**రిజిస్టర్లు, మందుల నిల్వలను పరిశీలించిన వైనం**

**మంచిర్యాల మేయర్ దర్నీ మధుకర్**



**వేల్పుల నగేష్ ,జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మేయర్ దర్నీ మధుకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వైద్యుల అటెండెన్స్ రిజిస్టర్ ను, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలను, మందులను ఆయన స్వయంగా పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని మేయర్ ఆదేశించారు. రోగులకు అన్ని రకాల పరీక్షలు చేసి అవసరమైన చికిత్స ఇక్కడే అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే పెద్ద ఆసుపత్రులకు పంపాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా వైద్యాధికారితో ఫోన్లో మాట్లాడి ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను వివరించారు. వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కంకణాల రోజా శ్యాంసుందర్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



# పోలీసుల నిజాయితీ.. పోగొట్టుకున్న నగదు అప్పగింత!

- లక్సెట్టిపేటలో బ్లూకోల్ట్స్ సిబ్బంది సమయస్ఫూర్తి
- సీసీ కెమెరాల సాయంతో పర్సు స్వాధీనం



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

పోలీసులు అంటే కేవలం శాంతిభద్రతలను కాపాడటమే కాదు.. ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడతామని లక్సెట్టిపేట పోలీసులు నిరూపించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి పోగొట్టుకున్న నగదును గంటల వ్యవధిలోనే తిరిగి అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు.

జన్నారం ప్రాంతానికి చెందిన నీలం జ్యోతి వ్యక్తిగత పనుల నిమిత్తం లక్సెట్టిపేట పట్టణానికి వచ్చారు. ఈ క్రమంలో స్థానిక బస్ స్టాండ్ వద్ద తన పర్సును పొరపాటున పోగొట్టుకున్నారు. ఆ పర్సులో 12,000 రూపాయల నగదుతో పాటు ముఖ్యమైన పత్రాలు ఉన్నాయి. పర్సు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్పందించిన బ్లూ కోల్ట్ కానిస్టేబుళ్లు రాజు, సునీల్ బస్ స్టాండ్ పరిసరాల్లోని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సాంకేతికతను ఉపయోగించి పర్సు ఎక్కడ పడిపోయింది.. దానిని ఎవరు తీసుకున్నారు అనే విషయాలను గుర్తించారు. అతి తక్కువ సమయంలోనే నగదుతో కూడిన పర్సును స్వాధీనం చేసుకున్నారు.

పోలీస్ స్టేషన్లో బాధితురాలు జ్యోతికి ఆమె నగదును క్షేమంగా అప్పగించారు. పోగొట్టుకున్న డబ్బు తిరిగి దొరుకుతుందని ఊహించలేదని బాధితురాలు ఆనందం వ్యక్తం చేశారు. సకాలంలో స్పందించి తనను ఆదుకున్న పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ పోలీసుల పనితీరును అభినందించారు. సీసీ కెమెరాల నిఘా ఎంతటి కీలకమైనదో ఈ ఘటన మరోసారి నిరూపించిందని వారు పేర్కొన్నారు.

# రైతు కుటుంబాలకు ఎమ్మెల్యే కొండంత అండ!

**మృతుల కుటుంబాలకు రెండు లక్షల చొప్పున ఆర్థిక సాయం**

**ప్రభుత్వ లబ్ధి చేకూరుతుందని భరోసా**



**దండేపల్లి, మే 10 (జనం పవర్):** దండేపల్లి మండలంలో అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల మరణించిన రైతు కుటుంబాలకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అండగా నిలిచారు. ముత్యంపేట గ్రామానికి చెందిన నెల్కి లచ్చన్న కుటుంబంతో పాటు బాధితులను ఆయన పరామర్శించారు. తన వంతు సాయంగా ఒక్కో కుటుంబానికి రెండు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మరణించిన రైతులకు రైతు బీమాతో పాటు ప్రభుత్వపరంగా అందే అన్ని రకాల ప్రయోజనాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతు కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా తాను తోడుంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేష్ పాల్గొన్నారు. సర్పంచులు అక్కల సత్యనారాయణ, కుడిమేత తిరుపతి, మాజీ ఎంపీపీ గురువయ్య, మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన షిండే!

**బిచ్కుంద, పిట్లం మండలాల్లో వివాహ వేడుకలకు హాజరు**

**నవ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు**

**బిచ్కుంద, మే 09 (జనం పవర్):** జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే శనివారం పలు వివాహ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. బిచ్కుంద పట్టణ కేంద్రంలోని బండాయప్ప ఫంక్షన్ హాల్ లో జరిగిన గాండ్ల గంగాధర్ టీచర్ కుమార్తె వివాహానికి ఆయన హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పిట్లం మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన రాములు మేనల్లుడు సాయికుమార్ వివాహ వేడుకలోనూ షిండే పాల్గొన్నారు. పిట్లం సిటీ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఈ వేడుకలో నవ దంపతులను దీవించారు. ఈ కార్యక్రమాల్లో బిచ్కుంద మండల అధ్యక్షుడు వెంకట్రావు దేశాయ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎన్.రాజు శ్రీహరి, మాజీ ఎంపీటీసీ గాండ్ల మహేష్, బస్వరాజ్ పటేల్ పాల్గొన్నారు. వీరితో పాటు డాక్టర్ రాజు, డాక్టర్ ఓం ప్రకాష్, పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



# వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోండి!

**ఈ నెల 11 నుంచి దండేపల్లిలో సమ్మర్ క్యాంప్**

**చదువుతో పాటు కళలు, క్రీడల్లో రాణించే అవకాశం**

**మండల విద్యాధికారి మంత్రి రాజు**

**దండేపల్లి, మే 10 (జనం పవర్):** విద్యార్థులు చదువుతో పాటు వివిధ కళల్లో రాణించాలని.. ఇందుకోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి మంత్రి రాజు కోరారు. ఈ నెల 11 నుంచి 25 వరకు 15 రోజుల పాటు దండేపల్లి ఉన్నత పాఠశాలలో ఈ శిబిరం జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 9వ తరగతి చదివే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరూ ఇందులో పాల్గొనవచ్చని సూచించారు.

సెలవులను వృథా చేయకుండా విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా వివిధ కార్యక్రమాల్లో రాణించేలా ఈ క్యాంపులో శిక్షణ ఇస్తామన్నారు. విద్యతో పాటు కళలు, క్రీడలు, సృజనాత్మకత, జీవన నైపుణ్యాలను నిపుణులు నేర్పిస్తారని వివరించారు. ఈ శిబిరం ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆదివారం ఉదయం 9 గంటలకు దండేపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంఘర్ష్ రాజేశ్వరరావును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు.





